పోచమ్మ వాడకు అధికారులు

- 'నమస్తే' కథనానికి స్పందన

కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఈ వెంకటేశ్

భీమారం, జూన్ 18 : 'పోచమ్మ వాడలో నీటి సమస్య తీర్చండి' అని 'నమస్తే'లో మంగళవారం వచ్చిన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వీ వెంకటేశ్, ఏఈ విద్యాసాగర్ స్పందించారు. ఉదయమే కాలనీకి చేరుకొని, కాలనీవాసులతో మాట్లాడారు. ఇంటింటికీ మిషన్‌భగీరథ నల్లాలు ఉన్నాయని, అవే దిక్కవుతున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ నీరు కూడా తక్కువగా వస్తున్నదని, నిత్యావసరాలకు బోరు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. నీటి సమస్యను తీరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి వేముల శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది కిష్టయ్య తదితరులు ఉన్నారు.

ప్రసవాలపై ప్రత్యేక చర్యలు

నస్పూర్, జూన్ 18 : ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో అనిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న బెల్లంపల్లికి చెందిన ఇప్ప గంగకు జిల్లా కేంద్రంలోని మాతా శిశు కేంద్రంలో అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ ద్వారా ద్వారా ప్రసవం చేసినట్లు పేర్కొన్నారు. 6 రోజుల పాటు ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా ఉన్నదని, ప్రతి రోజూ కొంతసేపు నడిచి నవజాత శిశు కేంద్రంలోని తన బిడ్డకు పాలు అందించిందని వివరించారు. ఈ నెల 15న గంగకు వెన్నుముక నొప్పి రావడంతో ఎంఆర్ఐ చేయగా, స్కానింగ్‌లో దీర్ఘకాలిక సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖాకు తరలించినట్లు పేర్కొనారు. మాతా శిశు కేంద్రంలో అందించిన చికిత్స, వైద్య సేవల్లో ఎలాంటి పొరపాటూ లేదని గాంధీ వైద్యులు నిర్ధారించాని వెల్లడించారు.

కుక్కల దాడిలో జింక మృతి

బాలాజీ అనుకోడలో కుక్కల దాడి నుంచి గ్రామస్తులు కాపాడిన జింక

చింతలమానేపల్లి, జూన్ 18 : చింతలమానేపల్లి మండలం బాలాజీ అనుకోడ గ్రామంలోకి శివారు పొలాల నుంచి కుక్కలు తరమడంతో ఓ జింక గ్రామంలోకి వచ్చింది. గ్రామస్తులు కాపాడి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారికి అప్పగించారు. కాగా, కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను ఎఫ్‌బీవో శ్రీదేవి, సిబ్బందితో వైద్యం కోసం కౌటాలకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందినట్లు వారు తెలిపారు. పంచనామా నిర్వహించి, ఖననం చేసినట్లు పేర్కొన్నారు. నీటి కోసం పొలాల్లోకి రావడంతోనే కుక్కల దాడికి గురైనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వణ్యప్రాణులను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిహారం కోసం వివరాల సేకరణ

బాధిత కుటుంబం వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

దహెగాం, జూన్18 : ఇటీవల హత్యకు గురైన చిన్నారి కుటుంబానికి పరిహారం అందించేందుకు వివరాలు సేకరిస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం చిన్నారి ఇంటికి వెళ్లి, వివరాలు సేకరించామన్నారు. తాము సేకరించిన వివరాలు కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేందర్, ఆర్ఐ నాందేవ్, కార్యదర్శి ప్రణీత్‌బాబు, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పుస్తక విక్రయాలు అరికట్టాలి

సీసీసీ నస్పూర్, జూన్ 18 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయాలను అరికట్టాలని, వారి గుర్తింపు రద్దు చేయాలని మాదిగ స్టూడెంట్ ఫోరం(ఎంఎస్ఎఫ్) జిల్లా ఇన్‌చార్జి కోండ్ర ఉదయ్ మాదిగ డిమాండ్ చేశారు. సీసీసీ నస్పూర్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని, అడ్మిషన్ ఫీజుల పేరుతో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు పట్టికోకపోవడం వల్లే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వెంటనే పాఠశాలలపై తనిఖీలు చేపట్టి, చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు సీపెల్లి సాజన్, గోపికృష్ణ, రిషికుమార్, మహేశ్, శ్రీకాంత్, శంకర్, భాస్కర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల రక్షణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

జన్నారం, జూన్ 18 : చెరువులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. జన్నారం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములపై అటవీశాఖ అధికారులు ఆంక్షలు విధించవద్దని, పోడు భూముల్లో నాగండ్లతోనే దున్నాలనడం, అందులో మట్టిని తీయకుండా అడ్డుకోవడం మానుకోవాలని సూచించారు. భూములపై వచ్చే ప్రతీ ఫిర్యాదను తహసీల్దార్ వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా ఉపాధ్యాయుడు ఉండాలని ఎంఈవో విజయ్‌కుమార్‌కు సూచించారు. ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, ఎంపీటీసీలు రియాజొద్దీన్, కొంతం శంకరయ్య, శ్రీవాణి, హరణి, మండల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

నస్పూర్, జూన్ 18 : మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌ను మంగళవారం టీఎన్‌జీవో నాయకులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, రామ్మోహన్, మల్లయ్య, బాపురావు, రాణి, సునీత, శ్రీనివాస్, తిరుపతి, గోపాల్, అజయ్ పాల్గొన్నారు.

ఎంసీహెచ్ హాలులో విసనకర్ర మాదిరి ఫైల్స్‌తో ఊపుకుంటున్న గర్భిణులు, బాలింతలు

ఎంసీహెచ్ ఎదుట ఆరుబయట నిద్రిస్తున్న రోగుల బంధువులు

ఫ్యాన్లు లేక.. ఉక్కపోతకు తాళ లేక

- మంచిర్యాల ఎంసీహెచ్‌లో గర్భిణులు, రోగుల అవస్థలు

మంచిర్యాల ఎంసీహెచ్‌లో ఫ్యాన్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రుళ్లు వారి బంధువులు, కుటుంబ సభ్యులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఇలా.. గర్భిణులు ఉక్కపోత తట్టుకోలేక తమ వెంట తెచ్చుకున్న మెడికల్ ఫైల్స్‌తో విసనకర్రలా ఊపుకొంటూ కనిపించారు. 'అధికారులు ఉన్నా లేకున్నా వారి గదుల్లో ఎప్పుడూ ఫ్యాన్లు తిరుగుతూనే ఉంటాయి.., ఎండ వేడికి ఇంత ఇబ్బందిపడుతున్నా పట్టించుకోరు.. ఇదే కర్మరా బాబూ..!' అని వాపోతున్నారు. గతంలో ఓ స్వచ్ఛంద సంస్థ విరాళంగా అందించిన ఫ్యాన్లు ఏమయ్యాయని పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. - మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జూన్ 18

'నులి' నివారణకు కృషి చేయాలి

మందమర్రి : మాట్లాడుతున్న మండల వైద్యాధికారి రమేశ్

దండేపల్లి : మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

మందమర్రి, జూన్ 18 : చిన్నపిల్లల్లో నులిపురుగుల నివారణకు కృషిచేయాలని మండల వైద్యాధికారి రమేశ్, ఎంపీడీవో రాజేశ్వర్ తల్లిదండ్రులకు సూచించారు. 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం వైద్య సిబ్బంది, మెప్మా, ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. 1 నుంచి 19 ఏండ్ల లోపు వారందరికీ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నటుల తెలిపారు. మొదటి విడుతగా 20న పంపిణీ ఉంటుందని, తప్పిపోయిన వారికి 27న పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీవో భీరయ్య, సీహెచ్‌వో గంగాధర్, సీవో సురేఖ, ఎంఆర్ఐ పద్మజ, మెప్మా టీఎంసీ రఘురాం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి : దండేపల్లి ఎంపీపీ శ్రీనివాస్

దండేపల్లి, జూన్ 18 : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దండేపల్లి ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య సిబ్బంది, కార్యదర్శులు, ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, వైద్యాధికారులు సతీశ్‌కుమార్, క్రాంతికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ సమావేశం

చెన్నూర్ రూరల్, జూన్ 19 : జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణ తేజ మాట్లాడారు. అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఎంఈవో రాధాకృష్ణ మూర్తి, హెచ్ఈవో జగదీష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల

కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఎంహెచ్‌వో తుకారాం భట్

ఆసిఫాబాద్ జూన్, 18: జాతీయ ఆరోగ్య మిషన్‌లో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఎంహెచ్‌వో తుకారాం భట్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జాతీయ ఆరోగ్యమిషన్‌లో భాగంగా పొరుగుసేవల ప్రాతిపదికన అర్హత గల పోస్టుల నియామకానికి అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని నోటీసు బోర్డులో, వెబ్ సైట్ www.asifabad.telangana.gov.inలో పొందుపరిచినట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 19 నుంచి 25 వరకు సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో తగిన ఆధారాలతో సంప్రదించాలని సూచించారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

మాట్లాడుతున్న డీఆర్డీవో కిషన్

మందమర్రి, జూన్ 18 : విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని మంచిర్యాల డీఆర్డీవో కిషన్ అన్నారు. పట్టణంలోని శ్రీపతినగర్‌లో లయన్స్ క్లబ్ సఖి మంచిర్యాల సహకారంతో జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ, వయోజన విద్యా కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. అభ్యాసకులు, శిక్షకుల కుటుంబ సభ్యుల వివరాలు, ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో డిజైన్ చేసి కుట్టిన దుస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుకునేందుకు వయస్సు అడ్డంకాదని, చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలను ఆయన అభినందించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం అభ్యాసకులు, శిక్షకులు శాలువాలతో పీడీ కిషన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, డీఆర్పీ బండ శాంకరి, కో-ఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, సూపర్‌వైజర్ ఉప్పులేటి నరేశ్, ట్రైనర్ శారద తదితరులు పాల్గొన్నారు.

గతేడాది కూలిపోయిన కార్యాలయ పైకప్పు

శిథిల భవనానికి మరమ్మతులు

చింతలమానేపల్లి, జూన్ 18 : చింతలమానేపల్లి ఎంపీడీవో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్నది. వర్షానికి ఊరుస్తూ ఇబ్బందికరంగా మారింది. గతేడాది ఇదే భవనంలోని ఉపాధి హామీ గది వరండా పైకప్పు కూలిపోయింది. కాగా, వర్షపు నీరు రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా అధికారులు కార్యాలయంపై డాంబర్ షీట్ కప్పుతున్నారు. ఈ కార్యాలయంలో మరమ్మతుల కోసం రూ.లక్షన్నర ఖర్చు చేస్తున్నామని ఎంపీడీవో కోట ప్రసాద్ తెలిపారు. అయితే శిథిలావస్థకు చేరిన భవనానికి లక్షల రూపాయలు పెట్టి, మరమ్మతులు చేసే కంటే కొత్త భవనం నిర్మిస్తే మంచిందని చూసిన స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రస్తుతం భవనంపై కప్పుపై డాంబర్ షీట్లతో మరమ్మతులు

ఏకగ్రీవ ఎన్నిక

శ్రీరాంపూర్, జూన్ 18 : నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా అనపర్తి యువరాజ్‌ను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ నియామక పత్రం ఇచ్చారు. శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశంలో అభినందించారు. సామాజిక, రాజకీయ, విద్యారంగాల్లో ఇప్పుడే వెలుగులోకి వస్తున్న నేతకాని సామాజిక వర్గానికి సమష్టి కృషితో తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం యువరాజ్‌ను శాలువాలతో సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాశ్, కలాలి నర్సయ్య, రాజారెడ్డి, అధికార ప్రతినిధి గొల్ల రాజమల్లు, న్యాయ సలహాదారు సల్లూరి మహేశ్, నాయకులు గోమాస రాజం, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్గం సంతోష్, ఉపాధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందచేత

కౌటాల, జూన్ 18 : మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన ఎకొన్కర్ దేవాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ముత్తంపేట తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారుడుగా పీఎంజేబీవై చేసుకోవడంతో నామనీకి రూ.2 లక్షల బీమా మంజూరైనట్లు మేనేజర్ అజేశ్ కుమార్ తెలిపారు. మంగళవారం దేవాజీ భార్య పుష్పబాయికి తహసీల్దార్ పుష్పలత చేతుల మీదుగా చెక్కును అందించారు.

ఇంటర్ ప్రవేశాల కోసం ఎంపిక జాబితా విడుదల

ఆసిఫాబాద్ టౌన్, జూన్18 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి రెండవ ఎంపిక జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మొదటి జాబితా ప్రవేశాల తర్వాత వివిధ గ్రూపుల్లో మిగిలిన 81 సీట్లను భర్తీ చేసేందుకు రెండవ జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19, 20వ తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. హాజరు కాని విద్యార్థుల సీటు రద్దు చేస్తామని తెలిపారు.

వర్షం కోసం పూజలు

కౌటాల, జూన్ 18 : వర్షాలు రాక రైతులు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కాదు. వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. మండలంలోని కన్నెపెల్లి గ్రామంలో మంగళవారం రైతులు ప్రాణహిత నుంచి జలాన్ని తెచ్చి, గ్రామ దేవతలకు అభిషేకాలు చేశారు. గ్రామ దేవతలు కరుణించి వర్షం వచ్చేలా చూడాలని వేడుకున్నారు.

గ్రామ దేవతలకు అభిషేకం చేసేందుకు నీటితో వెళ్తున్న మహిళలు

ఏఐఎస్ఎఫ్ జిల్లా అడ్‌హక్ కమిటీ

నస్పూర్, జూన్ 18 : మంచిర్యాలలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా అడ్‌హక్ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా బచ్చలి అభిరామ్, కో-కన్వీనర్‌గా జిలకర సిద్ధార్థ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మొగిలి లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దుర్గ రాజ్, కుమారస్వామి, రవి, సాయినిక్షిత్, హర్షిత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాగజ్‌నగర్, జూన్ 18 : కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మెయింటనెన్స్, తీగల కింద చెట్ల తొలగింపు కారణంగా పట్టణంలోని గుంటూర్ కాలనీ, సర్‌సిల్క్, డాడానగర్ కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

19 నుంచి స్పాట్ కౌన్సెలింగ్

ఆసిఫాబాద్ టౌన్, జూన్18 : జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ గురుకుల కళాశాలలో ఖాళీల భర్తీకి ఈ నెల 19 నుంచి 27 వరకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శారద మంగళవారం ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

అల్పాహారం ప్రారంభం

ఆసిఫాబాద్ టౌన్, జూన్18: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరావు విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించినప్పుడే చదువుపై దృష్టి పెడుతారని తెలిపారు. ఉపాధ్యాయులు ఉదయ్ బాబు, వెంకటేశ్వర్లు, నాయకులు ప్రసాద్ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

జైనూర్ జూన్ 18 : జైనూర్ మండల కేంద్రంలో మంగళవారం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గుర్రం అశ్విని పలు మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మందులు మెడికల్ స్టోర్‌లో ఉంచాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా డ్రగ్స్ అమ్మితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

బోరుపంపుల ఏర్పాటు

తాండూర్, జూన్ 18 : మండలంలోని అచ్చలాపూర్‌లోని లింగా పోచమ్మ, భీమన్న గుడి వద్ద, ఆటో స్టాండ్ వద్ద ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు ఆధ్వర్యంలో బోర్లు వేయించారు. మంగళవారం వాటికి పంపులు, పైపులు, హ్యాండిల్ అమర్చారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌పై కేసు సరికాదు

కోటపల్లి, జూన్ 18 : బీఆర్ఎస్ పార్టీ భీమారం మండల నాయకుడు, దళిత నాయకుడు కలగూర రాజ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదని కోటపల్లి ఎంపీపీ మంత్రి సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీమారం సమీపంలోని జోడువాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం జాప్యంపై రాజ్ కుమార్ ప్రశ్నిస్తే చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ డైరెక్షన్‌లో రాజ్ కమార్‌పై కేసు నమోదు చేశారని విమర్శించారు. అక్రమ కేసుల పెట్టినంత మాత్రాన దళితులు వెనుకడగువేయరని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నిస్తే కేసులు పెట్టడాన్ని ఎంపీపీ తప్పుబట్టారు. జోడు వాగుల వద్ద ప్రస్తుత పరిస్థితి తెలియనిది కాదని, రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురికావడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. అగ్ర కుల నాయకులు చెప్పడంతోనే దళితుడైన రాజ్ కుమార్‌పై భీమారం ఎస్ఐ కేసు నమోదు చేశారని ఆరోపించారు.

పాఠశాల పనుల పరిశీలన

దండేపల్లి, జూన్ 18 : దండేపల్లి మండలం ద్వారక, బిక్కనగూడ జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో దుర్గాదాస్, సీఆర్పీలు నర్సయ్య, సురేందర్, హెచ్ఎంలు చిన్న నర్సయ్య, గురువయ్య, రవీందర్ నాయక్ ఉన్నారు.

'మంచి ఉద్యోగిని కోల్పోయాం'

నస్పూర్, జూన్ 18 : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలో మంచి ఉద్యోగిని కోల్పోయామని డీఆర్డీవో కిషన్ అన్నారు. సెర్ప్‌లో అడ్మిన్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అర్ర రాజలింగు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కాగా, మంగళవారం డీఆర్డీఏ కార్యాలయంలో రాజలింగు చిత్రపటానికి పూలమాలలు వేసి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోవద్దు

చెన్నూర్ రూరల్, జూన్ 18 : నకిలీ విత్తనాలతో రైతులు మోసపోవద్దని చెన్నూర్ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు రసీదులు తప్పకుండా తీసుకోవాలని రైతులకు సూచించారు. పంటల సాగులో ఏఈవోల సూచనలు, సలహాలు పాలించాలని తెలిపారు. ప్రభుత్వ నిషేదిత విత్తనాలు విక్రయిస్తే దుకాణ యజమానులపై కేసులు పెట్టడంతోపాటు, లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎల్లమ్మ జాతర

వేమనపల్లి, జూన్ 18 : మండలంలోని రాజారాం సమీపంలో మంగళవారం ఎల్లమ్మ ఆలయంలో జాతర ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాజారాం, మంగెనపల్లి, సుంపుటం, జాజుపేట, దస్నాపూర్, ముల్కలపేట గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వ్యాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్

చెన్నూర్, జూన్ 18 : చెన్నూర్ పట్టణంలోని వ్యాటర్ ట్యాంకుల్లో మున్సిపాల్ సిబ్బంది మంగళవారం క్లోరినేషన్ చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని బేతాలవాడ, నల్లగొండ పోచమ్మ వాడల్లోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును శుభ్రం చేశారు. పనులను కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ పరిశీలించారు.

ప్రవేశ ద్వారం ప్రారంభం

కాసిపేట (బెల్లంపల్లి), జూన్ 18 : బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలోని శ్రీ సోమేశ్వర ఆలయ ముఖ ద్వారాన్ని మంగళవారం కమిటీ గౌరవ అధ్యక్షుడు కొమ్మెర లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ ద్వారానికి సహకరించిన దాత కామెర చెంద్ర మోహన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు రవీందర్, కార్యవర్గ సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

లక్షెట్టిపేట, జూన్ 18 : లక్షెట్టిపేట పట్టణంలోని కేజీబీవీలో 6వ తరగతితో పాటు ఇంటర్ ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు 6వ తరగతి ప్రవేశం కోసం, అలాగే 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఇంటర్ బైపీసీలో నిర్ణీత